




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 140 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 25 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :140 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 25 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

### 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!

- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

పెన్ పవర్ డెస్క్:అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది.

- మిగతా 2లో...



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ...

### ఇద్దరు మావోలు అరెస్ట్

- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్
- అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు
- అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ

- మిగతా 2లో...




## విదేశాల్లో భారత్ ‘వాంటెడ్‘.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- ‘వాంటెడ్‘ జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నారు: కేంద్ర ప్రభుత్వం
- పరారీలో ఉన్న వారి గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందన్న కేంద్రం
- ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు వెల్లడి
- వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత ఏడాది తిరిగి వచ్చినట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత రెండేళ్లలో ‘వాంటెడ్‘ జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ

- మిగతా 2లో...

# నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు

- కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం హామీ
- 2029 నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకువస్తానని వెల్లడి
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరిలో సీఎం చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్త సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన ‘స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర‘ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు.నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, “నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి“ అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన ‘స్వచ్ఛ రథాల‘ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు.

“స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది“ అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

### కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ



- ఎన్టీఆర్ తర్వాత సినీ ఇమేజ్ మీదే నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవన్న వర్మ
- సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని వ్యాఖ్య
- పవన్ బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:సినిమా గ్లామర్ ఒక్కటే ఆధారంగా పెట్టుకుని రాజకీయాల్లో దీర్ఘకాల విజయం సాధించడం సాధ్యం కాదని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్టీఆర్ తర్వాత కేవలం సినీ ఇమేజ్ మీదే రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమయ్యే నాయ కత్వం, వారి సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మాత్రం భిన్నంగా చూడాలన్నారు. పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడిగానే కాకుండా, ప్రజల మధ్య ఉండే బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని శ్రీనివాస్ వర్మ ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నేరుగా పోరాడటం, ప్రజలతో సన్నిహితంగా మెలగడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే, కూటమిగా కలిసి

- మిగతా 2లో...

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది



- బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్న కందుల దుర్గేశ్
- వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాలని వ్యాఖ్య
- వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:సమాజంలో బాలికల భద్రత, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ‘జాతీయ బాలికా దినోత్సవం’ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## బాలికలే భవిష్యత్ దీపికలు

పెన్ పవర్ డెస్క్:జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. బాలికలే భవిష్యత్ దీపికలని పేర్కొన్నారు. ‘సరైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పిస్తే బాలికలు ఆకాశమే హద్దుగా రాణిస్తారు. వారి హక్కులు, విద్య, భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలపై వివక్షను విడనాడదాం.. వారికి సమాన హక్కులు కల్పిద్దాం” అని లోకేశ్ అన్నారు.



## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!



- భారత్ పై 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న అమెరికా
- ఇటీవల రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించిన భారత్
- 25 శాతం టారిఫ్ లు తగ్గించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి హింట్

పెన్ పవర్ డెస్క్:భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది.

- మిగతా 2లో...



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# ప్రతీ చోటా జగనన్న సైన్యం... పక్కా వ్యూహం !

వైసీపీ అధినేత గత ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన చాలా వరకూ సక్సెస్ అయింది. కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు.

**బూత్ లెవెల్ నుంచి :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గం ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు. ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా ఒక యాభై మంది దాకా క్యాడర్ కి పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

**పదవ వంతుగా :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదవ వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా వైసీపీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా అయిదుగురిని పార్టీ వైపు మళ్ళించినా లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని మొత్తానికి నికరంగా ఒక లక్ష దాకా ఓట్లను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

**జగన్ విజన్ ఇదే :**

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ ని ప్రతీ వారూ తెలుసుకోవాలని అన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని అన్నారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన అన్నారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

**క్యాడరే లీడర్ :**

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ని తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తామని అంటున్నారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

- మొదటి పేజీ తరువాయి

దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫీఈఎంఏ) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికలకు వెళ్లడం వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు.

ఇక జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, ప్రస్తుతం దేశంలో సినీ స్టార్లను మించిన స్టార్ ప్రధాని నరేంద్ర మోదీ అని శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలోనే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ పొత్తుల విషయంలో అగ్రనాయకత్వమే చర్చించి తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై కూడా ఆయన స్పందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్థిక భారం తగ్గించే క్రమంలోనే సీఐఎస్ఎఫ్ బలగాల ఉపసంహరణ జరిగిందని వివరణ ఇచ్చారు. ఫిబ్రవరి 4న ఉక్కు శాఖ కార్యదర్శి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- మొదటి పేజీ తరువాయి

మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని

ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# 40 ఏళ్లుగా గర్భం మోసిన మహిళ.. 82 ఏళ్ల వయసులో నొప్పులు.. కట్ చేస్తే!



మాతృత్వం అనేది పెళ్లి అయిన ప్రతి ఒక్క మహిళ కల. ఏడు నెలలు లేదా తొమ్మిది నెలలు మోసి పండంటి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. ఇక ఆ బిడ్డను అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటూ జీవితం ధన్యం చేసుకుంటూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక మహిళ ఏడు కాదు తొమ్మిది కాదు ఏకంగా 40 ఏళ్ల పాటు గర్భవతిగా ఉండి.. చివరికి 82 సంవత్సరాల వయసులో నొప్పులు రావడంతో హాస్పిటల్ కి వెళ్ళింది. పరీక్షించిన వైద్యులు అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మరి 40 ఏళ్ల పాటు ఆ తల్లి తన గర్భంలో బిడ్డను మోసి.. 82 సంవత్సరాల వృద్ధాప్యంలో నొప్పులు రావడం ఏంటి? ఇది నిజంగా నిజమేనా? కనీసం ఈ విషయం ఆమెకు కూడా తెలియలేదా? అని కొంతమంది ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా కొన్ని కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానీ నిజాలుగా మారుతున్న వేళ. ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో నోరెళ్ళబదుతున్నారు. అదెలా సాధ్యమనే ఆలోచనలో పడిపోతున్నారు. అలాంటి ఒక సంఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఒక మహిళ వయసు 82 సంవత్సరాలు. ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు లోపల కణితి ఉంటుందని భావించారు. కానీ స్కానింగ్ తర్వాత అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. కారణం ఆమె శరీరంలో 40 సంవత్సరాలకు పైగా ఒక కాల్సిఫైడ్ గర్భస్థ శిశువు ఉంది. అంటే 40 సంవత్సరాలుగా ఆమె గర్భవతి అన్నమాట. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో లిథోపెడియన్ లేదా స్టోన్ బేబీ అని పిలుస్తారు. అంటే గత 40 ఏళ్ల క్రితం ఆ మహిళకు ఎక్టోపిక్ గర్భం ఏర్పడిందట . అంటే గర్భస్థ శిశువు గర్భం లోపల కాకుండా గర్భం బయట అభివృద్ధి చెందడం.. దీని కారణంగానే ఆ మహిళకు పురిటి నొప్పులు అందరి లాగే రావడం , బిడ్డను కనడం వంటి పరిస్థితి ఎదురు కాలేదు.

పైగా ఈ సంక్రమణను నిరోధించడానికి అనుగుణంగా ఆమె శరీరం గర్భస్త శిశువును క్యాల్షియంతో ఆవరించి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసిందట. ఫలితంగా శిశువు గర్భాశయం వెలుపలి భాగంలో ఒక మమ్మీ సైడ్ రూపంగా మారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందుకే ఎటువంటి గర్భస్థ లక్షణాలను కూడా కనబరచలేకపోయింది. నిజానికి ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయట. వైద్య చరిత్రలో ఇప్పటివరకు కేవలం 300 కేసులు మాత్రమే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఇకపోతే ఈ విషయం ఎక్కడ? ఎప్పుడు? ఎవరిలో జరిగింది అనే పూర్తి వివరాలు మాత్రం లేవు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది

- మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను కేవలం కాపాడుకోవడమే కాదు, వారిని ఉన్నత విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం అందరిపైనా ఉందన్నారు.

బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం అత్యంత కీలకమని చెప్పారు. బాలికల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు మాత్రమే కాదు... అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములేనని మంత్రి గుర్తు చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరించారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

- మొదటి పేజీ తరువాయి

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి

ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది.

వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కూటమి పక్కన పెట్టింది...వైసీపీ షాక్ ఇచ్చేసింది

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల మంది దాకా వాలంటీర్లను తీసుకుంది. వీరికి గౌరవ వేతనంగా అయిదు వేల రూపాయలను ఇచ్చింది. వీరిని ప్రతీ యాభై కుటుంబాలకు బాధ్యులుగా చేసింది. ఆ విధంగా వీరు తమకు రాజకీయంగా ఉపయోగపడతారు అని భావించింది. కానీ విషయం చూస్తే మొత్తానికి మొత్తం బూమరాంగ్ అయింది.

**రెండింటికీ చెడి :**

వాలంటీర్లను తీసుకుని వచ్చి వైసీపీ పార్టీ నాయకులను క్యాడర్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. అన్నీ వారే చూస్తారు అని ధీమా పడింది. తీరా ఎన్నికల సమయంలో ఈసీ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్లు అంతా సైడ్ అయిపోయారు. మరో వైపు కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారు వైసీపీని వదిలేసి ఆ వైపుగా పనిచేసారు. కూటమి అధికారంలోకి వస్తే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీతో వైసీపీని వారే ఓడించేశారు. ఇలా వైసీపీ వ్యూహాలు రెండిందాలుగా చెడిపోయి ఎన్నడూ లేని విధంగా భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది.

**కొన్నాళ్ళు ఆందోళన :**

వాలంటీర్లు అయితే కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ పాటు ఆందోళనలు నిర్వహించారు. తమకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని చెప్పారని తమను విధులలోకి తిరిగి తీసుకోవాలని వారు కోరారు. అయితే వారి సేవలను 2023 ఆగస్టు నుంచే వైసీపీ ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని టెక్నికల్ సాకులు చూపించి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అదే సమయంలో నెలవారీగా అందించే సామాజిక పెన్షన్లను కూడా సచివాలయ ఉద్యోగుల చేత అందిస్తోంది. ఈ క్రమంలో వాలంటీర్ల సేవలు అందడం లేదని ఎవరూ అనుకోవడం లేదు, క్రమంగా వారి గురించి కూడా అంతా మరచిపోయారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విగ్రహాల పరిశుభ్రత




**చింతపల్లి పెన్ పవర్ జనవరి 24 :-** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛ ఆంధ్ర భాగంలో సోమవారం77వ గణతంత్ర దినోత్సవం జరగబోవు సందర్భంగా అల్లూరి సీతారామరాజు నడియాడిన పుణ్యభూమి అయినా చింతపల్లి పోలీస్ స్టేషన్ మరియు ఉప ఖజానా కార్యాలయం ఆఫీస్ ఎదురుగాఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహ పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయ భారతి మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పూర్ణారావు, ఈశ్వర్, నాగేశ్వరావు పాల్గొన్నారు

## 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ప్రభుత్వ విప్



**గుమ్మలక్ష్మీపురం జనవరి 24. పెన్ పవర్.** మండలం కేంద్రంలో స్థానిక ఎంపీడీవో ఐవి లక్ష్మి,ఆధ్వర్యంలో శనివారం 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్. తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నాని తడి చెత్త పొడి చెత్త ను వేరు చేసి సేకరించే స్వచ్ఛ వాహనం ద్వారా తరలించే విధానంలో భాగంగా నూతన స్వచ్ఛ రథం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి సేకరించడం ద్వారా పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉండటమే కాక ఆరోగ్యకరంగా ఉంటామని అన్నారు స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ కట్టర్ కళావతి,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి,బిజెపి మండల కన్వీనర్ కత్రక అప్పలస్వామి,ఐ.సి.డి.ఎస్, పి డి.తాసిల్దార్ ఎం శేఖర్, ఎంఈఓ.చంద్రశేఖర్, మరియు మండల స్థాయి అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల లో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బిజినెస్ ఆపరేషన్స్ అనే అంశంపై ఇండస్ట్రియల్ గెస్ట్ టాక్



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జనవరి 24** విజ్ఞాన్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్, దువ్వాడ, విశాఖపట్నం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ -- సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బిజినెస్ ఆపరేషన్స్ అనే అంశంపై ఇండస్ట్రియల్ గెస్ట్ టాక్?ను నిర్వహించారు .

గెస్ట్ టాక్?ను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టెక్ సాఫ్ట్?వేర్ సర్వీసెస్ -- బిజినెస్ గ్రూప్ ఆపరేషన్స్ విభాగానికి చెందిన ప్రతినిధి మిస్టర్ చిన్ని ప్రకాష్ నిర్వహించారు. ఆధునిక వ్యాపార కార్యకలాపాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, డిజిటల్ ట్రాన్స్?ఫార్మేషన్, ఆటోమేషన్, డేటా ఆధారిత నిర్ణయాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ప్రాధాన్యతను వివరించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలు, అనుకూలత, మరియు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాల్సిన అవసరాన్ని మిస్టర్ చిన్ని ప్రకాష్ స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వాస్తవ వ్యాపార ప్రక్రియలు మరియు పరిశ్రమల అంచనాలపై అవగాహన కలిపించారు .

అనంతరం నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్?లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఉద్యోగ అవకాశాలు, కార్పొరేట్ రంగంలో ఎదురయ్యే సవాళ్లపై తమ సందేహాలను పరిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జి. సుజాత , పి. మౌనిక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – – సైబర్ సెక్యూరిటీ విభాగం పర్యవేక్షణ లో కార్యక్రమాని విజయవంతం చేశారు. అధ్యాపకులు , విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా మలిచారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూధన రావు, సిఎస్?ఈ--సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డా. కె. రోహిత్ కుమార్ తదితర అధ్యాపక బృందం అతిథి మిస్టర్ చిన్ని ప్రకాష్?ను సత్కరించి, విద్యార్థుల్లో పరిశ్రమలపై అవగాహన పెంపొందించడంలో చేసిన విలువైన సేవలను అభినందించారు.



# రోజ్ గార్ మేళా ఘన విజయం







### లక్షలాది యువతకు ఉద్యోగ అవకాశాలు

### ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మిషన్ మోడ్‌లో సాగుతోంది

### కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్ జనవరి 24 :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను వేగవంతంగా భర్తీ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోజ్?గార్? మేళా ఘన విజయాన్ని సాధించిందని కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఈ మేళా ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించి, వారికి కొత్త ఆత్మవిశ్వాసం, ఆశాభావం కలుగుతోందన్నారు.

గతంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో తీవ్రమైన జాప్యం ఉండేదని, సంవత్సరాల తరబడి నోటిఫికేషన్లు వెలువడని పరిస్థితులు నెలకొన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మిషన్ మోడ్?లో చేపట్టి, వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పేర్కొన్నారు.

**392 మందికి నియామక పత్రాలు**

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని సాగర్?మాల కన్వెన్షన్ సెంటర్?లో శనివారం ఉదయం నిర్వహించిన రోజ్?గార్? మేళా కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. విశాఖపట్నంలో మొత్తం 392 మందికి నియామక పత్రాలు అందజేయడం విశేషమని తెలిపారు.

**11 లక్షల మందికి ఉద్యోగాలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 17 రోజ్?గార్? మేళాలను విజయవంతంగా నిర్వహించి సుమారు 11 లక్షల మందికి నియామక పత్రాలు అందజేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తాజాగా నిర్వహించిన 18వ రోజ్?గార్? మేళాలో దేశవ్యాప్తంగా 61 వేల మందికి నియామక పత్రాలు అందజేశామని వెల్లడించారు.

మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా కార్యక్రమాలతో పాటు ఎంఎస్?ఎంఈ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించగలుగుతున్నామని, ఇది దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది అవుతుందని శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఐజీ శర్వానన్, సీఐఎస్ఎఫ్ డీఐజీ డా. రాఘవేంద్రకుమార్, పోర్టు సెక్రటరీ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు




## అన్నవరంలో అసంపూర్తిగా రోడ్డుపనులు :పొంచి ఉన్న పెను ప్రమాదం

### నిర్లక్ష్యంతో గుంతలు మృతికుహరాలుగా మారాయి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం,గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని అన్నవరం గ్రామంలో రోడ్డు మరమ్మత్తు పనులు గ్రామస్తులకు శాపంగా మారాయి. రోడ్డు అభివృద్ధి కోసం మంజూరు చేసిన పనులు ప్రారంభించి నెల రోజులు గడిచినా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ క్రమంలో కాలువ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు ఐదు మీటర్ల లోతులో భారీ గుంతలు తీసి వదిలేశారు. ప్రస్తుతం ఆ గుంతల్లో నీరు చేరడంతో అవి మృతికుహరాల్లా మారాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఒక ఎద్దు, కొన్ని మేకలు గుంతల్లో పడిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవగా, వాటిని గ్రామస్తులు అప్రమత్తంగా కాపాడాల్సి వచ్చింది. ఇదే దారిలో పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ ప్రయాణించాల్సి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరగబోతుందోనని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల కోసం తెచ్చిన కంకరను పాఠశాల ఆవరణలోనే ఎడారిగా వేసి వెళ్లడంతో అక్కడ కూడా గుంతలు ఏర్పడి పిల్లలు ఆడుకోవడానికి, నడవడానికి వీలుగా లేకుండా పోయింది. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగుపడుతుందని సంతోషించినప్పటికీ, ఇప్పుడున్న రోడ్డు ప్రాణాలు తీసేలా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పనులను పూర్తి చేయాలని, ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చి నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

## తెలుగుదేశం పార్టీ శిక్షణ తరగతులకు విశేష స్పందన





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జనవరి 24 :** విజయవాడలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల శిక్షణ తరగతులకు విశేష స్పందన వస్తుందని 86 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలోనే క్రమశిక్షణ గల పార్టీ తెలుగుదేశం పార్టీ అని, పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని శిక్షణా తరగతుల్లో పాల్గొనడం ద్వారా మరింత స్పష్టత వచ్చిందని అన్నారు. శిక్షణ తరగతులలో పలువురు రాష్ట్ర మంత్రులను ఎమ్మెల్యేలను కలిసి పార్టీ కోసం చర్చించే అవకాశం తెలుగుదేశం పార్టీ కల్పించిందని అన్నారు. శిక్షణ తరగతులకు తనతో పాటు వార్డు సెక్రటరీ బి జగదీష్ హాజరయ్యారని తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి.

### జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్. తోయక జగదీశ్వరి.




**గుమ్మలక్ష్మీపురం జనవరి 24 పెన్ పవర్.** మండల కేంద్రంలోని భద్రగిరి పిటిజి గురుకుల బాలికల పాఠశాలలో శనివారం నాడు ఐసిడిఎస్ పిడి కనకదుర్గ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ & కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకను అధిరోహించాలన్నారు. అలా జరగాలంటే విద్యుత్ తోనే సాధ్యమని విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో చదువుకోవాలి బాలికలే భవిష్యత్తుకు దీపికలు బాలికలకు సరైన విద్య,నైపుణ్యాలు,అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారని ఆకాంక్షించారు. బాలికల హక్కులు,విద్య,భద్రత కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమాజంలో బాలికలపై ఉన్న వివక్షను పూర్తిగా విడనాడి,వారికి సమాన అవకాశాలు కల్పించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మన్యం నృత్యాన్ని ప్రదర్శించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా ట్రైబల్ స్టేట్ మీట్ లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.ప్రణీత,కె. సింధు పరుగు పందెంలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వారికి సాలువలు కప్పి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కద్రక కళావతి,మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి,సిడిపిఓ విజయగౌరీ,ఎంపీడీఓ,ఐ.వి. లక్ష్మి,తహసీల్దార్,ఎం శేఖర్,ఎంఈఓ,చంద్రశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ భద్రతలో కార్పొరేట్ భాగస్వామ్యం




## గోపాలపట్నంలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్సార్ షాపింగ్ మాల్ కీలక సహకారం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 24 :** విశాఖపట్నం నగరంలో పెరుగుతున్న వాహన రద్దీ, రోడ్ ప్రమాదాల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా బాధ్యత తీసుకుంటున్నాయి. ఈ దిశగా గోపాలపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సార్ షాపింగ్ మాల్ యాజమాన్యం ముందడుగు వేయడం అభినందనీయం. రోడ్ ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లక్ష్యంగా 25 ట్రాఫిక్ స్టాపర్స్?ను ఎస్సార్ షాపింగ్ మాల్ డొనేట్ చేయడం సామాజిక బాధ్యతకు చక్కటి ఉదాహరణగా నిలిచింది. ఈ స్టాపర్స్?ను ట్రాఫిక్ ఏసీపీ ఎస్. వాసుదేవ్ ఓల్డ్ గోశాల జంక్షన్ వద్ద అధికారికంగా ప్రారంభించారు. ముఖ్యంగా ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉండే ఈ జంక్షన్ వద్ద స్టాపర్స్ ఏర్పాటు చేయడం వలన వాహనాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని ట్రాఫిక్ అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం ట్రాఫిక్ పోలీస్ విభాగం తరఫున ఎస్సార్ షాపింగ్ మాల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యం రూపంలో ఇలాంటి సహకారం కొనసాగితే నగరంలో రోడ్ భద్రత మరింత మెరుగవుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇదే కార్యక్రమంలో భాగంగా, నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు, ట్రాఫిక్ ఏడీసీపీ సూచనల మేరకు జరుగుతున్న జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై ఏసీపీ అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చని వాహనదారులకు వివరించారు. అలాగే రోడ్ ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించడంతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఉందని ఏసీపీ పిలుపునిచ్చారు. ప్రైవేట్ సంస్థలు అవసరమైన ఎక్విప్మెంట్?ను డొనేట్ చేయడం ద్వారా రోడ్ భద్రతలో భాగస్వాములవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె. సురేష్, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్సై ఆర్. సూరిబాబు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా చూస్తే, ఎస్సార్ షాపింగ్ మాల్ చేసిన ఈ సహకారం నగరంలో రోడ్ భద్రతపై అవగాహన పెంచడమే కాకుండా, ఇతర కార్పొరేట్ సంస్థలకు కూడా ఆదర్శంగా నిలిచే చర్యగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 24 :** స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 92వ వార్డు, గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్?, "30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి" లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గణబాబు ఆసుపత్రిలోని వివిధ గదులు, వార్డులను సందర్శించి పరిశుభ్రత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, సందర్శకులను అడిగి పరిశుభ్రత, వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో అమలు చేస్తున్న వ్యర్థాల విభజన విధానాన్ని పరిశీలించిన గణబాబు, తడి--పొడి వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేసి నిర్దేశించిన రంగు డస్ట్ బిన్ లలో మాత్రమే వేయాలని సిబ్బందికి, ప్రజలకు సూచించారు.

స్వచ్ఛతను కాపాడుకోవడం ద్వారా ఆసుపత్రి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించిన ఆయన, వారికి అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అనంతరం ఆసుపత్రి అభివృద్ధి, పనితీరు, అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి రమేష్ నాయుడు, బొమ్మిది రమణ, జోనల్ కమిషనర్ రాము, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత, డాక్టర్ నివేదిత, ఆసుపత్రి కమిటీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శృంగవరపుకోటలో రథసప్తమి వేడుకలు




**శృంగవరపుకోట, పెన్ పవర్, జనవరి 24 :** సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్), విశ్వ హిందూ పరిషత్ (వి.హెచ్.పి) సంయుక్త ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిమ్ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో యుగాలుగా ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. గాలి, నీరు, భూమి, అగ్ని, సూర్యుడు వంటి సహజ శక్తులపై జీవజాలం ఆధారపడి ఉందన్నారు. సూర్యరశ్మి ద్వారా జరిగే కిరణజన్య సంయోగ క్రియ వల్లే పత్రం, పుష్పం, ఫలం వంటి జీవనాధారాలు ఉద్భవిస్తున్నాయని తెలిపారు. అందువల్ల సూర్యుడే సమస్త జీవుల మనుగడకు ఆధారమని, ఈ కారణంగానే రథసప్తమికి ప్రాచీనకాలం నుంచే ప్రత్యేక ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ యం. చిన్నబాబు, ఇన్?చార్జి ప్రిన్సిపాల్ బి. ప్రమీల, విశ్రాంత ఉపాధ్యాయుడు యం. శ్రీనివాసరావు రథసప్తమి ప్రాముఖ్యతను, శ్లోకాల పఠనం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పంచాయితీ వార్డు సభ్యుడు బొబ్బిలి అప్పారావు, వి.హెచ్.పి జిల్లా సేవా ప్రముఖ్ పిల్లా బుజ్జి శ్రీరామ్, మండల భజన బృంద సంఘ అధ్యక్షుడు బొజ్జా జగన్నాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా నిత్య స్తుతి శ్లోకాల పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వి.హెచ్.పి జామి, యస్.కోట మండలాల అధ్యక్షుడు యం. సత్యన్నారాయణ సారథ్యంలో పాల్గొన్నవారందరూ ఆదిత్య హృదయం స్తోత్రాన్ని పఠించారు.

## కట్టుపల్లి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహణ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీలో కట్టుపల్లి గ్రామంలో మరియు పరిసర గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వెటర్నరీ అసిస్టెంట్ సత్యనారాయణ సారథ్యంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శిబిరంలో పశు పెంపకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువులకు అనారోగ్యం సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాథమిక చికిత్సలు వివరించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక పశుపాలకులకు ఉపయోగకరమైన సమాచారం అందించడమే లక్ష్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు శశికాంత్, జయరాం, గణపతి, లోవా కుమార్, వెంకట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అధిక యూరియా వాడకంతో నేల బలహీనత




★ నానో యూరియాతోనే భూసారం పరిరక్షణ

★ అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, పెన్ పవర్ జనవరి 24 :** అవసరానికి మించి యూరియా వాడకం సాగు భూముల భూసారాన్ని దెబ్బతీసి, దీర్ఘకాలంలో దిగుబడులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ రూపొందించిన మినుము సాగు బ్రోచర్?తో పాటు, యూరియా మితిమీరిన వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేలలో ఆమ్లత్వం పెరిగి, సేంద్రీయ పదార్థం తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా భూగర్భ జలాలు కలుషితమవడమే కాకుండా, ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు.

నానో యూరియా వైపు రైతుల మళ్లింపు

సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను రైతులు విస్తృతంగా వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. తక్కువ మోతాదులోనే ఎక్కువ ప్రయోజనం చేకూర్చే నానో యూరియా వల్ల సాగు వ్యయం తగ్గడంతో పాటు, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

రైతులు పొలాల్లో విచ్చలవిడిగా ఎరువులు వేయకుండా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి సమతుల్యంగా ఎరువులు వినియోగించినప్పుడే నాణ్యమైన, లాభదాయక దిగుబడులు సాధ్యమవుతాయని అన్నారు.

మినుము సాగులో శాస్త్రీయ పద్ధతులు అవసరం

మినుము సాగులో విత్తన శుద్ధి నుంచి తెగుళ్ల నియంత్రణ వరకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని మంత్రి పేర్కొన్నారు. రసం పీల్చు పురుగులు, బూడిద తెగులు, మారుక మచ్చల పురుగు వంటి తెగుళ్ల నివారణకు అవసరమైన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ కరపత్రాల ద్వారా రైతులకు చేరవేస్తోందని తెలిపారు.

2025--26 రబీ సీజన్?లో రైతులు ఈ సూచనలను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో రైతులకు నానో యూరియాపై శిక్షణ ఇచ్చి, ఆధునిక సాగు విధానాల వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథ స్వామి, ఏడీఏ జగన్మోహన్ రావు, ఏడీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ఠంగా రథసప్తమి పోలీసు బందోబస్తు




★ తుది ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి

★ భక్తుల భద్రతే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జనవరి 24:** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో నిర్వహించనున్న రథసప్తమి మహోత్సవాల సందర్భంగా చేపట్టిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ తుది దశలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి చిన్నపాటి లోపాలు కూడా తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

డీఎస్పీ వివేకానందతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలు, దర్శన మార్గాలు, క్యూ లైన్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, ప్రసాదం కౌంటర్లు, పాదరక్షలు ఉంచే ప్రాంతాలు, విఐపీ దర్శన మార్గాలు, కంట్రోల్ రూమ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను జిల్లా ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూ లైన్ల నిర్వహణలో క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, తోపులాటలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణ పకడ్బందీగా

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా పోలీసు బృందాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, సీసీ కెమెరాల సహాయంతో అన్ని కీలక ప్రాంతాలను పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

భక్తులతో పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి అవసరమైన మార్గనిర్దేశం అందిస్తూ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సమన్వయం, సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ రథసప్తమి వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా జరిగేలా ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ నిర్వహణ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని స్థానిక రెవెన్యూ తాహాసిల్దార్ హెచ్.అన్నాజీ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారంగా నిలబడి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. అలాగే "ప్రజాస్వామ్యంలో ఓటర్ పాత్ర" అనే అంశంపై మండలంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల (రింతాడ) విద్యార్థులకు వ్యాసరచన, హ్యాండ్‌రైటింగ్, డిబేటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ,రెవెన్యూ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రకై 66 వార్డ్ లో అవగాహన సదస్సు




**గాజువాక :పెన్ పవర్ ,జనవరి 24** జీవీయంసి 66వ వార్డు సీతారామ నగర్ లో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగం గా పరిశుభ్రతపై, ప్లాస్టిక్ వాడకాలు నివారణపై, ప్రతి ఒక ఇంట్లో మరుగుదొడ్లు సెప్టిక్ ట్యాంకులు, పరిశుభ్రతపై జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, 66వ వార్డు కూటమి వీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, 66వ వార్డు కూటమి నాయకులు, సీతారామ నగర్, సొంతిల్లు యజమానులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు . అధికారుల సమక్షంలో ప్రతి ఒక్కరికి పరిశుభ్రతపై వివరించారు . ప్రతినెల మూడవ శనివారం వార్డులో తూచా తప్పకుండా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు స్వాగతిస్తున్నారని , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో జరుగుతున్న కార్యక్రమం లో వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, వార్డు జనసేన అధ్యక్షుడు రమణ, సీనియర్ నాయకురాలు లంకలత, వార్డు తెలుగుదేశం మహిళా నాయకురాలు ఆశ, మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ భాష, వార్డ్ ట్రెజరర్ల,లక్ష్మణరావు, మహమ్మద్ షబ్బీర్, అన్సర్ వల్లి, సాయిరాం, బూత్ ఇన్చార్జులు, తారకేష్, బుజ్జి , నాయుడు, ఎలమంచిలి వర్ధన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రథసప్తమి ఏర్పాట్లు ఆదర్శంగా నిలవాలి





- చిన్న తప్పిదానికీ చోటు ఉండకూడదు
- ఉన్నత స్థాయి సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జనవరి 24 :**అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాల నిర్వహణలో ఈసారి ఎలాంటి చిన్నపాటి పొరపాట్లకూ అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది చేపట్టే ఏర్పాట్లే భవిష్యత్తు ఉత్సవాలకు మార్గదర్శకంగా నిలిచేలా ఒక ఆదర్శవంతమైన ప్రామాణిక విధానంగా (ఎస్?ఓపీ) ఉండాలని స్పష్టం చేశారు.

శనివారం మధ్యాహ్నం సన్రైజ్ హోటల్?లో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మరికొద్ది గంటల్లో స్వామివారి నిజరూప దర్శనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, యంత్రాంగం అంతా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు.

బాధ్యతల్లో స్పష్టత అవసరం

ప్రతి సెక్టార్?కు కేటాయించిన డీఎస్పీలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తమ సిబ్బందితో కలిసి గ్రూపులుగానే విధుల్లోకి రావాలని, విధుల మార్పిడి సమయంలో కూడా అదే విధంగా సమూహంగా బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో ఎక్కడా ఖాళీలు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

క్యూలైన్లలో భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని, ఉచిత దర్శన లైన్లో ఉన్న భక్తుల కోసం టీ, పాలు, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సర్వీస్ లైన్లను కేవలం అత్యవసర సేవలకే పరిమితం చేయాలని, విధుల్లో ఉన్న సిబ్బందిపై ఆహారం అందలేదన్న ఫిర్యాదులు రాకుండా చూడాలని హెచ్చరించారు.

భక్తులతో మర్యాదగా వ్యవహరించాలి : ఎస్పీ

జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సెక్టార్?ను ఏఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. భక్తులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలిగేలా చూడాలని ఆదేశించారు. "భక్తులు భక్తిశ్రద్ధలతో వస్తారు. వారి భావోద్వేగాలను గౌరవించాలి. ఎక్కడా తోపులాటలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి," అని సూచించారు.

టికెట్ కౌంటర్ల వద్ద స్కానింగ్ యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎల్?ఈడీ స్క్రీన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులకు ఎస్పీ సూచించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

మొబైల్ టాయిలెట్ల వద్ద నిరంతర శుభ్రత పాటించాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి నుంచి దర్శనాలు ప్రారంభమై ఆదివారం రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగనున్న నేపథ్యంలో, అన్ని శాఖల మధ్య సమన్వయం, సమయస్ఫూర్తితో పని చేసి రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల కోలాటం ఆకట్టుకుంది

- 'మన్యం డాన్స్' కార్యక్రమాన్ని ప్రశంసించిన కలెక్టర్ ప్రభాకర రెడ్డి





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ పార్వతీపురం, జనవరి 24:** విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి ప్రారంభించిన 'మన్యం డాన్స్' కార్యక్రమం శనివారం ఉత్సాహంగా కొనసాగింది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రతి మూడవ శనివారం అమలవుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ కోలాటం నృత్యం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల లయబద్ధమైన అడుగులు, శ్రద్ధగా చేసిన ప్రదర్శనను కలెక్టర్ ఆసక్తిగా తిలకించి, వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి తోడ్పడటమే కాకుండా, మన సంప్రదాయాలపై అవగాహన పెంచుతాయని కలెక్టర్ తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయులు మురళీ, చిన్నమ్మల పర్యవేక్షణలో కోలాటం ప్రదర్శన అత్యంత ఆకర్షణీయంగా సాగింది. 'మన్యం డాన్స్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల శారీరక చురుకుదనం, మానసిక ఉత్సాహం పెరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ముస్తాబు కార్యక్రమంతో పాటు ఈ వినూత్న ప్రయత్నం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతోందని కలెక్టర్ కృషిని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోను సత్యనారాయణ, గ్రామ పెద్దలు విక్రాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అరసవల్లికి వచ్చే వాహనాలకు ప్రత్యేక రూట్ మ్యాప్





- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసుల కీలక మార్గదర్శకాలు
- వాహన రకం, దర్శన టికెట్?ను బట్టి పార్కింగ్ కేటాయింపు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జనవరి 24:**అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో సూర్యజయంతి వేడుకల సందర్భంగా భక్తుల రాకపోకలతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసు శాఖ సమగ్ర రూట్ మ్యాప్ ను విడుదల చేసింది. భక్తులు వచ్చే మార్గాలు, వాహనాల రకం, దర్శన టికెట్ల ఆధారంగా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించినట్లు పోలీసులు తెలిపారు. ప్రతి భక్తుడు ఈ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

వీఐపీ వాహన పాస్ ఉన్నవారికి

వాహన పాస్ కలిగిన వీఐపీ భక్తులు మిల్ జంక్షన్ -- మామిడి తోట మార్గం ద్వారా ఆలయ ప్రధాన ఆర్చ్ వద్దకు చేరుకోవాలని సూచించారు. వాహనాలను సూర్యతేజ కల్యాణ మండపం వద్ద కేటాయించిన వీఐపీ పార్కింగ్?లో నిలపాలి. దర్శనం అనంతరం గుండ రమణ పెట్రోల్ బంక్, ఆదిత్య నగర్ కాలనీ, డీఈఓ కార్యాలయం మీదుగా ఉమెన్స్ కాలేజీ రోడ్డు ద్వారా సూర్య మహల్ జంక్షన్ వైపు వెళ్లాలని పోలీసులు తెలిపారు.

నాలుగు చక్రాల వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు

సూర్య మహల్, సెవెన్ రోడ్ జంక్షన్ వైపు నుంచి వచ్చే ఫోర్ వీలర్ వాహనాలు 80 ఫీట్ రోడ్డులోకి ప్రవేశించి, తెలుగు ముసలయ్య కాలనీ మీదుగా ఎల్.ఎస్. ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలని సూచించారు. తిరుగు ప్రయాణంలో వాటర్ ట్యాంక్ పక్కనుగా 80 ఫీట్ రోడ్డు చేరుకుని, వాంబే కాలనీ, పొట్టి శ్రీరాములు జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

ద్విచక్ర వాహనాల పార్కింగ్

ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తులు 80 ఫీట్ రోడ్డు ద్వారా తెలుగు ముసలయ్య కాలనీకి చేరుకుని, విలువిద్య శిక్షణా కేంద్రం లేదా ఎల్.ఎన్. కల్యాణ మండపం సమీపంలోని ఖాళీ స్థలాల్లో వాహనాలను నిలపాలని పోలీసులు సూచించారు.

ఇతర మార్గాల నుంచి వచ్చే భక్తులకు సూచనలు

గార, అంపోలు మార్గం: ఈ మార్గంలో వచ్చే భక్తులు తమ వాహనాలను వాడాడ జంక్షన్ వద్ద నిర్దేశించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేయాలి.

అక్కడి నుంచి అసిరితల్లమ్మ ఆలయం వద్ద రూ.100 లేదా ఉచిత దర్శనం లైన్లలోకి ప్రవేశించవచ్చని తెలిపారు.

రూ.500 లేదా డోనర్ టికెట్లు ఉన్న గార మండలం భక్తులు వాహనాలను వాడాడ జంక్షన్ వద్దే నిలిపి, కాలినడకన గుండ రమణ పెట్రోల్ బంక్ మీదుగా మామిడి తోట సమీపానికి చేరుకోవాలని సూచించారు.

కుందువానిపేట, పీజే పేట మార్గం: కలెక్టర్ కార్యాలయం వెనుక వైపు నుంచి వచ్చే వారు కాజీపేట, అరసవల్లి వెలమ వీధి వద్ద వాహనాలు నిలిపి దర్శనానికి వెళ్లాలి.

బస్సుల రాకపోకలకు మార్గనిర్దేశం

పలాస -- నరసన్నపేట మార్గంలో వచ్చే బస్సులు గురజాడ కాలేజీ వద్ద డైవర్షన్ తీసుకుని, అంపోలు గ్రామం, అంపోలు జంక్షన్ మీదుగా వాడాడ జంక్షన్ వరకు వచ్చి భక్తులను దింపాలని పోలీసులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కూడా అదే మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

భక్తులు పోలీసు శాఖ సూచించిన రూట్ మ్యాప్?ను పాటించడం ద్వారా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా సురక్షితంగా దర్శనం చేసుకోవచ్చని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ఎమ్మెల్యేకు మర్యాదపూర్వకంగా కలిసిన దామనాపల్లి పంచాయితీ వైసీపీ నేతలు

గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 24:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో జరిగిన వైసీపీ నేతల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజును దామనాపల్లి పంచాయతీ వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా దామనాపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, పార్టీ నాయకులు సాగిన సత్తిబాబు, సిందేరి కర్రయ్య, వంతల రాజ్ కుమార్, కొర్ర గోవిందా రావు, సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పాత సామాన్లకు సరుకుల మార్పిడి

- 'స్వచ్ఛ రథం'కు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకారం
- పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జనవరి 24:** ఇంటిళ్లలో పేరుకుపోయిన పాత ప్లాస్టిక్, పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను ఇచ్చి, వాటికి బదులుగా అవసరమైన కిరాణా సరుకులు పొందే వినూత్న 'స్వచ్ఛ రథం' కార్యక్రమానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకారం చుట్టారు. శనివారం మండలంలోని సిలగాం, సింగవలస గ్రామాల్లో జడ్పీ సీఈవో సత్యనారాయణతో కలిసి ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న పాత ప్లాస్టిక్ వ్యర్థాలు, పనికిరాని ఎలక్ట్రానిక్ సామగ్రిని స్వచ్ఛ రథానికి అందజేసి, చిన్న గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు పొందవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెరగడంతో పాటు, ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం మరింత బలపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన జీవన విధానానికి ఇది దోహదపడుతుందని అన్నారు.

మండలంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛ రథం పర్యటించనుందని, గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూఆధార్ నమోదు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు



**గూడెం కొత్త వీధి పెన్ పవర్,జనవరి 24**:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా భూఆధార్ ( ఏపీఎఫ్ఆర్) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ప్రయోజనాలు పొందాలంటే భూఆధార్ నమోదు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి 1-బి, ఆధార్ కార్డు, సెల్?ఫోన్ తీసుకువెళ్లాలని సూచించారు. భూఆధార్ నమోదు ప్రక్రియ మూడు దశల్లో పూర్తి అవుతుందని, ప్రతి దశలో రైతుల మొబైల్ ఫోన్?కు సందేశాలు వస్తాయని తెలిపారు.గ్రామాల్లో అందుబాటులో లేని రైతులు కూడా తమ మొబైల్?కు వచ్చే సందేశాల ద్వారా ఏపీఎఫ్ఆర్ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.కావున మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూఆధార్ నమోదు పూర్తిచేసుకోవాలని ఆయన కోరారు.

## కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మండల స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 24:**కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ఆ మోసాలను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పేర్కొన్నారు.గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పంచాయతీ, మారుమూల గ్రామాల్లో గడప గడపకూ చేరవేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను తొలగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని, పార్టీ సంస్థాగత నిర్మాణంలో కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ కుమార్, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు వసుపరి తిమోతి, మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్,మాజీ జెడ్పిటిసి మచ్చల మత్య రాజు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుందేరి రామకృష్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్,నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కంకిపాటి రామారావు,యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు లంబసింగి రమేష్?, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ మండల వైసిపి అధ్యక్షులు కంకిపాటి నారాయణతో పాటు వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కార్యదర్శులు, సోషల్ మీడియా, యూత్ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

## స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పారిశుద్ధ్యంపై అవగాహన

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ దాడి వెంకట రమేష్






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 24 :** విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని వెస్ట్ జోన్ 89వ వార్డు, ఎల్లపువాని పాలెం, ఎస్సీ కాలనీ ప్రాంతంలో సాస ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండటం అత్యవసరం అని, బహిరంగ మలమూత్ర విసర్జన చట్టపరంగా నేరం అని ప్రజలకు వివరించారు. ఆరోగ్యకరమైన జీవనానికి పారిశుధ్యం ఎంతో కీలకమని, ముఖ్యంగా మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇంటింటా మరుగుదొడ్లు అవసరమని ఆయన పేర్కొన్నారు.

అలాగే ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం జీవీఎంసీకి సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్, అనధికార వాహనాలను ఉపయోగించడం వల్ల కలిగే ఆరోగ్య, పర్యావరణ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, శానిటేషన్ సెక్రెటరీలు, సిఓ పాల్గొని పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, స్వచ్ఛత చర్యలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం విశేషం, వారు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఈ అవగాహన కార్యక్రమం ద్వారా కాలనీలో స్వచ్ఛతపై ప్రజల్లో చైతన్యం పెరిగిందని, స్వచ్ఛమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇది దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# విత్తనాల పండగ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్

**యువతకు క్రీడా కిట్లు అందజేసిన సర్పంచ్ కే. రామకృష్ణ**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని మాడెం కాలనీ గ్రామంలో విత్తనాల పండగను పురస్కరించుకుని యువతను ఉత్సాహపరిచే కార్యక్రమాల భాగంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కే. రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. గిరిజన సాంప్రదాయాలను కాపాడే దిశగా ప్రతి యువకుడు ముందడుగు వేయాలని, పండగలను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజనులే ప్రపంచానికి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిచయం చేసినవారని పేర్కొన్నారు.ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులు, చట్టాలను విస్మరించడమే కాకుండా గిరిజనుల సాంప్రదాయాలు, పండగలను కూడా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితులపై గిరిజనులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని యువత, గ్రామస్తులకు సూచించారు. గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవించినప్పుడే గిరిజనులు కూడా ప్రభుత్వాలను, అధికారులను గౌరవిస్తారని, లేకపోతే సంప్రదాయ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కృష్ణాబాబు, మాడెం గ్రామ యువత, మాజీ వాలంటరీ చిట్టిబాబు, వినోద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలేశు, మల్లేశు, గజిని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, యువత భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# విద్యార్థులకు దోమతెరలు దుప్పట్లు పంపిణీ...!

### విద్యార్థులతో మత్తు పదార్థాలు వల్ల వచ్చే అనర్థాలపై ర్యాలీ





**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 24** గిరిజన సంక్షేమ బాలుర, గురుకుల కళాశాల విద్యార్థులకురాంకీ గ్రూప్ ఎన్?జీఓ ఆధ్వర్యంలో దోమతెరలు దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని కాకరపాడు ఏపీఆర్ కళాశాల రాజేంద్రపాలెం ఏపీటిడబ్ల్యుఆర్ బాలికల పాఠశాలలో రామ్ కి సమస్త అధినేత శ్రీకాంత్ ఆధ్వర్యంలోకొయ్యూరు సీఐ శ్రీనివాస్ దోమ తెరలు, దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ...

విద్యార్థులు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, కెరీర్ మార్గదర్శనం, మహిళలపై జరుగుతున్న నేరాలు, అలాగే విద్యార్థి జీవితంలో క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

అనంతరం, ఏపీఆర్ కాలేజీ విద్యార్థులతో కలిసి కాలేజీ ప్రాంగణం నుండి కాకరపాడు జంక్షన్ వరకు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించి, సాధారణ ప్రజలకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, రాంకీ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# శంబర జాతరకు విస్తృత ఏర్పాట్లు

- జాతర ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్
- భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి



**శంబర, జనవరి 24 స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్.** : జనవరి 26, 27, 28వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే శంబర పోలమాంబ జాతరకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. శనివారం మక్కువ మండలం శంబర పోలమాంబ జాతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఏఎస్పీలు ఎం.మనీషా రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీనిని రాష్ట్ర కార్యక్రమంగా ప్రకటించిందన్నారు.జిల్లా నలుమూలల నుండి అలాగే పొరుగు జిల్లాలు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. శంబర పోలమాంబ జాతర అనేది ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రసిద్ధి చెందిన పండుగని,చాలా మంది యాత్రికులు ఆరాధ్య దేవత దర్శనం కోసం వస్తారని పేర్కొన్నారు. ఉత్తర ఆంధ్రాలో జరిగే అతి పెద్ద పండుగలలో ఒకటైన ఈ పండుగలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని తెలిపారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి అడుగు పకడ్బందీగా వేయాలని అధికారులను ఆదేశించారు. "సిరిమాను ఉత్సవం"లో ముఖ్యంగా విద్యుత్ సరఫరా సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. పారిశుధ్యం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఆమె అన్నారు. తాగునీరు ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆమె కోరారు. ప్రజలు పోలమాంబ దర్శనం చేసుకునేందుకు ప్రజా రవాణా శాఖ తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లకు ప్రజలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. క్యూలైన్లు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ఆలయానికి ఆనుకుని ఉన్న గోముఖి నది వద్ద స్నానాలు, వంటలు చేపట్టడంపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. పోలీసులు సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు.

జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకుండా చూడాలని ఆదేశించారు. జాతర చూసేందుకు ప్రజలు ఎక్కే ఏనుగు కొండ వద్ద ప్రాణాలను రక్షించే ఏర్పాట్లు చేయాలని, మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పాయింట్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర ఏర్పాట్ల మ్యాప్ ను పరిశీలించిన ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండాలని సూచించారు. బారికేడింగ్?తో పాటు సరైన వెలుతురును ఏర్పాటు చేయాలని, క్యూ లైన్లలో అత్యవసర నిష్క్రమణ పాయింట్లను కూడా ఉండాలని సూచించారు. ఆర్టిసి బస్సులను ఏర్పాటు చేస్తోందని, వైద్య, ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. పారిశుధ్య కార్మికుల ఏర్పాటుతో పాటు అవసరమైన మెటీరియల్?ను పంచాయతీ రాజ్ శాఖ ఏర్పాటు చేస్తుందని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# దొడవ గొయ్యి నుండి కిండంగి వరకు తారు రోడ్డు నిర్మించండి

### అధికారులకురోడ్డు మంజూరు చేయాలని గిరిజనులు వినతి



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 24** మండలంలోనిమారుమూల బూదరాళ్ల పంచాయితీ పరిధిలో బూదరాళ్ల గ్రామం నుండి దొడవగొయ్యి మీదుగా కిండంగి గ్రామం వరకు 6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు గిరిజనుల వినతి. శనివారం మండలంలోని బూదరాళ్ల పంచాయితీ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ సభ్యుడు సంజీవ్ గ్రామస్థులతో కలిసి కొయ్యూరులో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడుతూప్రస్తుతం 6కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు ఉందన్నారు. వర్షకాలం వచ్చిందంటే పూర్తిగా కొట్టుకోపోతుందని, కావున తారురోడ్డు మంజూరు చేయాలనీ ఏఈ గారికి కోరగా ఈ విషయంపైఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెళతానని ఆమె హామీ ఇచ్చారు

## గూడెం కొత్తవీధిలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 24:**రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛంద కార్యక్రమాన్ని గూడెం కొత్తవీధిలో శనివారం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది సమన్వయంతో చేపట్టినట్లు స్థానిక సర్పంచ్?, ఎంపీటీసీలు కొర్ర సుభద్ర, రీమల రాజేశ్వరి తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై సలహాలు ఇచ్చి, ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాల వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంబాబు, సచివాలయ సిబ్బంది సుమన్, మహిళా కానిస్టేబుల్ వనిత, స్థానిక బాలికల పాఠశాల పీడీ శాంతి, వివిధ పాఠశాలల విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మర్రిపాలెం కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర...




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 24**డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మర్రిపాలెంప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఇందులోభాగంగా జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల ఆవరణలో పూర్తిస్థాయి పరిశుభ్రత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కర్రి సుధ మాట్లాడుతూ... పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యాసంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. బహిరంగ మలవిసర్జన వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మరియు పరిసరాల పరిశుభ్రత దెబ్బతింటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శౌచాలయాలను వినియోగించాలి అని సూచించారు.

అనంతరం కళాశాల సిబ్బంది విద్యార్థులు కలిసి కళాశాల పరిసరాలను పూర్తిగా పరిశుభ్రపరిచారు. చెత్తను వేరు వేరు విధాలుగా సేకరించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం వంటి చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఏ కో--ఆర్డినేటర్ డాక్టర్ డి.సి.హెచ్. రాజుబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గండ్రెడ్డి రామునాయుడుని పరామర్శించిన పెందుర్తి ఎమ్మెల్యే



**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 24 :** స్థానికపెందుర్తి నియోజకవర్గం పరిధిలోని వాలిమరక పంచాయతీ దువ్వపాలెం గ్రామంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు గండ్రెడ్డి రాము నాయుడుని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఈ రోజు పరామర్శించారు.ఈ సందర్భంగా గండ్రెడ్డి రాము నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వారికి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీకి, ఉద్యమాలకు ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ, ఇలాంటి కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సింహాద్రి అప్పలరాజు, సింహాద్రి దేవుడుబాబు, కరణం కనకారావు, సేనాపతి సోమశేఖర్, రాపర్తి కిషోర్, ముక్క రాము నాయుడు తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ భూ సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ





**గాజువాక: పెన్ పవర్ ,జనవరి 24** జీవీఎంసీ పరిధి 65వ వార్డు భానోజీ తోట బాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో అంగరంగ వైభవంగా ప్రతి వారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఆలయ సేవకులు ఆర్థిక సహాయంతో నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిథులకు మాట్లాడుతూ ప్రతి వారు నిర్వహించే ప్రసాద వితరణ భక్తుల సహాయ సహకారాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. రేపు రథసప్తమి సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుండి సూర్యనారాయణ స్వామి దర్శన భాగ్యం కలుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది రెండవది ఏడు వారాలు వెంకటేశ్వర స్వామికి ముడుపులు కట్టి ఎనిమిదవ వారం ముక్కు చెల్లించుకున్న వారికి వెంకటేశ్వర స్వామి ఉంటుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో తుంపాల వెంకటేష్, ఒమ్మ ఈశ్వరి, గొరుసు రామలక్ష్మి, పూడి శాంతి, పప్పల ఆదిలక్ష్మి, పాండురంగ జయరాజ్, పెంటకోట రాజు మరియు ఆలయ సేవకులు ఆలయ నిర్వాహకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గగన విహారంతో విశాఖ







**ఉత్సవాలకు నూతన ఆకర్షణ**

**హెలికాప్టర్ రైడ్‌కు పోటెత్తిన పర్యాటకులు**

**భీమిలిలో హాట్ ఎయిర్ బెలూన్?తో ఆకాశంలో సందడి**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 24 :**విశాఖ ఉత్సవాల్లో ఈ ఏడాది ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న హెలికాప్టర్ రైడ్ నగరవాసులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తొలిసారి విశాఖ ఉత్సవాల్లో అందుబాటులోకి వచ్చిన ఈ గగన విహార సౌకర్యం సందర్శకులకు మరపురాని అనుభూతిని అందిస్తోంది.

బీచ్ ప్రాంతం, ఆర్కే బీచ్, నగర తీరప్రాంతాల అందాలను గగనతలంలో నుంచి వీక్షించే అవకాశం లభించడంతో హెలికాప్టర్ రైడ్?కు భారీగా స్పందన వస్తోంది. ముఖ్యంగా యువత, కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, నిర్ణీత సమయాల్లో రైడ్?లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భీమిలిలో హాట్ ఎయిర్ బెలూన్ ఆకర్షణ

విశాఖ ఉత్సవాల్లో మరో ప్రధాన ఆకర్షణగా భీమిలి బీచ్ వద్ద హాట్ ఎయిర్ బెలూన్ ప్రదర్శన నిలుస్తోంది. రంగురంగుల బెలూన్లు ఆకాశంలో ఎగిరే దృశ్యం సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తోంది. సముద్ర తీరాన్ని, భీమిలి పరిసరాలను ఎత్తునుంచి వీక్షించే అవకాశం లభించడంతో పర్యాటకులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

సాయంత్రం వేళ బెలూన్ ప్రదర్శన జరుగుతున్న సమయంలో బీచ్ ప్రాంతం ఉత్సవ కళతో నిండిపోతోంది. పిల్లలు, మహిళలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ గగన విన్యాసాన్ని ఆస్వాదిస్తున్నారు.

పర్యాటకానికి కొత్త ఊపు

హెలికాప్టర్ రైడ్, హాట్ ఎయిర్ బెలూన్ వంటి సాహసోపేత కార్యక్రమాలు విశాఖ ఉత్సవాలకు కొత్త గుర్తింపునిచ్చాయని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఆకర్షణల ద్వారా విశాఖను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

విశాఖ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక గగన ఆకర్షణలు నగర పర్యాటకానికి మరింత ఊపునిస్తున్నాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ శ్రీ శారదా పీఠంలో ఘనంగా రెండవ రోజు వార్షిక మహోత్సవాలు

- శ్రీ రాజశ్యామల హోమంతో పరవశించిన భక్తులు
- వేద మంత్రోచ్చారణలతో మారుమోగిన పీఠ ప్రాంగణం



**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 24 :** విశాఖ శ్రీ శారదా పీఠంలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలు రెండవ రోజుకు ఘనంగా కొనసాగుతున్నాయి. పీఠ ప్రాంగణం భక్తుల సందడి, పూజా కార్యక్రమాల వైభవంతో ఆధ్యాత్మిక ఉత్సవ శోభను సంతరించుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం అత్యంత పవిత్రమైన శ్రీ రాజశ్యామల హోమం శాస్త్రోక్తంగా ఘనంగా ప్రారంభమైంది. ఈ హోమాన్ని పీఠాధిష్ఠాన దేవత అయిన శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి అంకితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారు స్వయంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందించారు.

అమ్మవారి ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, పుష్పాలంకరణలు, దీపారాధనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం పీఠ ప్రాంగణంలోని సర్వ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఉచ్చరించిన వేద మంత్రాలు, హోమ మంత్రోచ్చారణలతో పీఠ ప్రాంగణం మారుమోగింది. వేద ఘోషలతో నిండిన ఈ దివ్య వాతావరణం భక్తుల మనస్సులను ఆధ్యాత్మికంగా పరవశింపజేసింది.

హోమాగ్నిలో ఆహుతులు సమర్పించబడుతున్న వేళ భక్తులు అమ్మవారి నామస్మరణతో తలమునకలయ్యారు. శ్రీ రాజశ్యామల హోమం ద్వారా గ్రహానుకూలత, మానసిక శాంతి, వ్యాపార అభివృద్ధి, ధనప్రాప్తి, శత్రు నాశనం, సకల కార్యసిద్ధి లభిస్తాయని పండితులు వివరించారు.

ఈ హోమంలో పాల్గొన్న భక్తులు తమ కుటుంబాల సంక్షేమం, లోక క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ మహోత్సవాలను దర్శించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. అమ్మవారి దర్శనంతో పరమానందం పొందిన భక్తులు, పీఠంలో నిర్వహిస్తున్న యాగాలు, హోమాలు, పారాయణాలలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

రేపటి కార్యక్రమాలు 25-01-2026, ఆదివారం

ఉదయం 8.00 గంటలకు: శ్రీ దక్షిణామూర్తి స్వామివారికి విశేషాభిషేకం. ఉదయం 9.00 గంటలకు ఆదిత్య హృదయ పారాయణ, ఉదయం 9.30 గంటలకు త్రిచ సహిత అరుణ పారాయణ, విశేష సూర్యారాధన, సూర్య హోమం, దక్షిణామూర్తి హోమం, ఉదయం 10.00 గంటలకు: శ్రీ రాజశ్యామల సహిత చండీ యాగం ఈ కార్యక్రమాలన్నీ లోక క్షేమం, ధర్మ పరిరక్షణ, భక్తుల సంక్షేమం కోసమే నిర్వహిస్తున్నామని ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ దివ్య మహోత్సవాలలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం, ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆడిట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలి





**ఖాతాల నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోం**

**పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలపై అధికారులకు పీయూసీ కమిటీ ఆదేశాలు**

**వీఎంఆర్డీఏ, జీసీసీ, ఏయూ, ఈపీడీసీఎల్ ఆర్థిక కార్యకలాపాలపై సమీక్ష**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 24** వీఎంఆర్డీఏ, జీసీసీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆడిట్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని అసెంబ్లీ పబ్లిక్ అండర్?టేకింగ్స్ కమిటీ (పీయూసీ) చైర్మన్ కూన రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లాలోని వివిధ సంస్థలకు సంబంధించిన పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలు, వార్షిక ఖాతాల నివేదికలపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

2017--18 నుంచి 2021--22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వార్షిక ఖాతాలు, అకౌంటెంట్ జనరల్ సూచనలు, ఆడిట్ నివేదికలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పలు విభాగాల్లో ఆడిట్ అభ్యంతరాలు సంవత్సరాల తరబడి పెండింగ్?లో ఉండటాన్ని చైర్మన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ఖాతాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

జాప్యానికి బాధ్యులపై చర్యలు

ఖాతాల తయారీ, నివేదికల సమర్పణలో జాప్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కూన రవికుమార్ హెచ్చరించారు. బోర్డు సమావేశాల్లో ప్రతి అంశాన్ని లోతుగా చర్చించి, ఆడిట్ పారా అభ్యంతరాలపై నిరంతర సమీక్ష జరగాలని ఆదేశించారు.

వీఎంఆర్డీఏ ఒక ఆర్థిక సంస్థ తరహాలో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, అక్కడి ఆర్థిక లావాదేవీలు అత్యంత క్రమశిక్షణతో, పూర్తి పారదర్శకతతో జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఖాతాల నిర్వహణలో చిన్నపాటి లోపం కూడా భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక, పరిపాలనా సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

పెండింగ్?లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కమిటీ ఆదేశించింది. ఇకపై అన్ని నివేదికలు స్పష్టంగా, పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించింది.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి

వీఎంఆర్డీఏ పరిధిలో భారీ సంఖ్యలో కోర్టు కేసులు పెండింగ్?లో ఉన్న విషయంపై చైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 835 కోర్టు కేసులు, 141 ఆడిట్ నివేదికలు పెండింగ్?లో ఉండటం శోచనీయమని వ్యాఖ్యానించారు. అవసరమైతే మధ్యవర్తిత్వ విధానాన్ని (మిడియేషన్) అనుసరించి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోర్టు కేసులు, ఆర్థిక సమస్యలు సంస్థల పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక మెకానిజం అభివృద్ధి చేయాలని సూచించారు.

ఇతర సంస్థలపై సమీక్ష

అనంతరం జీసీసీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఈపీడీసీఎల్ సంస్థల ఆర్థిక కార్యకలాపాలు, ఖాతాల నిర్వహణపై కమిటీ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసింది.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులు నడికూటి ఈశ్వరరావు, కుమార్ రాజా వర్ల, గౌతు శిరీష, తెనాలి శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ యు. నాగమునెయ్య, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, సెక్రటరీ మురళీకృష్ణ, సీయూపీ శిల్పా, సీఈ వినయ్ కుమార్, సీఏవో హరి ప్రసాద్, ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ కె. రాంబాబు, ఈపీడీసీఎల్ సిఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు, ఎస్.ఈ. శ్యాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం




**పద్మనాభం,పెన్ పవర్, జనవరి 24 :**పద్మనాభం మండలంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా జీరో గ్యాప్ శానిటేషన్ స్వచ్ఛ ఆంధ్ర అంశాలపై ప్రజలకు అవగాహ న కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ సందర్భంగా పరిశుభ్రత, పారిశుధ్య ప్రా ముఖ్యత పై నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్య వంతులను చేశారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు. అలా గే మానవహారం నిర్వహించి స్వచ్ఛతపై సమిష్టి బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి. నాగేష్, మండల తహసీల్దార్ కే. ఆనందరా వు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి. శ్యామల, ఎం శేఖ ర్ వివిధ శాఖల అధికారులు, మండల నాయ కులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొ న్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను ప్రతి గ్రా మం, ప్రతి ఇంటి వరకు తీసుకెళ్లాలని, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో స్వచ్ఛతపై మంచి అవగాహన ఏర్పడిం దని వారు పేర్కొన్నారు.

# చంద్రనగర్లో ఘనంగా శ్రీ సీతారాములవారి తీర్థ మహోత్సవం

**స్వామివారిని దర్శించుకున్న మౌర్యసింహ, కార్పొరేటర్ దాడి వెంకట రమేష్**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 24 :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం, 89వ వార్డు, చంద్రనగర్ కొలివై ఉన్న శ్రీ సీతారాములవారి తీర్థ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ, స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ పాల్గొనడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా మతపరమైన ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా ఉన్న గౌరవం, ప్రోత్సాహం స్పష్టంగా కనిపించింది. స్థానిక ప్రజలతో కలిసి వారు తీర్థ మహోత్సవంలో పాల్గొనడం వల్ల నాయకులు, ప్రజల మధ్య అనుబంధం మరింత బలపడినట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా యువత ప్రతినిధిగా మౌర్యసింహ ఉత్సవంలో చురుకుగా పాల్గొనడం రాజకీయ వారసత్వంతో పాటు సామాజిక బాధ్యతను కూడా ప్రతిబింబించింది. అలాగే కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను దగ్గర నుంచి తెలుసుకునే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారని విశ్లేషణ. ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు కేవలం మతపరమైనవే కాకుండా, సామాజిక ఐక్యతకు వేదికలుగా మారుతున్నాయని ఈ మహోత్సవం మరోసారి నిరూపించింది. ప్రజాప్రతినిధులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణకు తోడ్పాటు అందించడమే కాకుండా, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగించే అవకాశాన్ని పొందుతున్నారు. మొత్తంగా, శ్రీ సీతారాముల వారి తీర్థ మహోత్సవం భక్తి, సంప్రదాయం, రాజకీయ, సామాజిక సమన్వయానికి ప్రతీకగా నిలిచిందని చెప్పవచ్చు.

# పాస్టర్స్ అండ్ లీడర్స్ కాన్ఫరెన్స్‌లో



- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్,
- వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పాల్గొనడం

**విశాఖ దక్షిణం పెన్ పవర్, జనవరి 24 :**ఉత్తరాంధ్ర ప్రాంత ఆత్మీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన "పాస్టర్స్ అండ్ లీడర్స్ కాన్ఫరెన్స్" ఈరోజు విశాఖ నగరంలోని 46వ వార్డు కైలసపురంలో ఘనంగా జరిగింది. గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విక్టర్ పాల్ గారి సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరియు విశాఖ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కె.కె. రాజు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పాస్టర్స్, లీడర్స్ ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించి, వైఎస్సార్సీపీ పార్టీకి, పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కి తమ సంపూర్ణ మద్దతు మరియు సంఘీభావా న్ని ప్రకటించారు. ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం కోసం వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేపడు తున్న కార్యక్రమాలు అభినందనీయమని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 46వ వార్డు కార్పొరేటర్, డి ప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు బలిరెడ్డి గోవింద్, పార్టీ సీని యర్ నాయకులు జాన్ వెస్లీ, దూది నర్సింగ రావు, రామారావు, కె. ఈశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేశారు.

ఈ సమావేశం ఉత్తరాంధ్రలో ఆధ్యాత్మిక ఐక్య తతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేసిందని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.

## బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి...

ఎస్సై వై.తారకేశ్వరరావు....



**నాతవరం పెన్ పవర్ (జనవరి 24):** బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వై.తార్గేశ్వరరావు అన్నారు.శనివారం మండలంలో గల వైడిపేట పంచాయితీ మర్రిపాలెం గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై తారకేశ్వర మాట్లాడుతూ ఫోక్సో చట్టం,సైబర్ నేరాలపై బాలికలకు అవగాహన కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలు కూడా తెలుసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ రేవతమ్మ, సిడిపిఓ గౌరి,కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు భవాని, అంగన్వాడి సిబ్బంది రాజేశ్వరి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నాయకుడికి అండగా పార్టీశ్రేణులు





**గాజువాక :పెన్ పవర్ ,జనవరి 24** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సింగడి సింహాచలం గారు కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ లో ఆర్ట్ సర్జరీ చేయించుకోవడం జరిగింది. వారిది పేద కుటుంబం అవడంతో 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు . ఈ కార్యక్రమంలో డొక్కా రమేష్ , కోసూరి తాతారావు , గీత అన్నపూర్ణ, గంతకోరు సత్యవతి, రావాడ శిరీష, గోపిశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- గురుకుల విద్యాసంస్థల్లో
- విద్యార్థుల భద్రత.
- ఆరోగ్య పర్యవేక్షణ.
- నైతిక బాధ్యత.
- పరిపాలన జవాబుదారితనం
- అన్నింటిపై సమగ్ర విచారణ జరిపించాలి.
- విద్యార్థి విభాగం అనుబంధ అధ్యక్షులు. బొత్తాడ గౌరీ శంకర్రావు.



**గుమ్మలక్ష్మీపురం జనవరి 24 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం నాడు పత్రిక విలేకరులతో విద్యార్థి విభాగం అనుబంధ అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకరరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గురుకుల విద్యాసంస్థలు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని.ఇటీవల కురుపాం ఏకలవ్య మోడల్ స్కూల్‌లో ఒక విద్యార్థిని గర్భం దాల్చిన విషయం వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ప్రతి నెలా విద్యార్థుల పట్ల యాజమాన్యం బాధ్యత వహించి ఆరోగ్య సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు సూచించినప్పటికీ ఇంతటి కీలక విషయం ఏ విధంగా గుర్తించలేకపోయారనే ప్రశ్నలు తలెత్తుతున్న అన్నారు.ఇది పూర్తి పరిపాలనా నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా అని విద్యార్థి విభాగం ప్రశ్నిస్తోందని ఆయన మండిపడ్డారు.ఇలా విద్యార్థుల జీవితాలు,భవిష్యత్తును గాలికి వదిలేస్తే ఎలా విద్యార్థుల భద్రతపై పర్యవేక్షణ లేకుండా గురుకుల వ్యవస్థ ఎలా కొనసాగుతుందనే అంశంపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు.గురుకుల విద్యాసంస్థల్లో,విద్యార్థులభద్రత,ఆరోగ్య పర్యవేక్షణ,నైతిక బాధ్యత,పరిపాలనా జవాబుదారీతనం అన్నింటిపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే విద్యార్థి విభాగం,విద్యార్థి సంఘాలు మరియు గిరిజన సంఘాలు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

# పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం.

స్వచ్ఛ రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**అరకులోయ పెన్ పవర్ 24:**అరకు నియోజకవర్గం మండల కేంద్ర పరిధిలో ట్రైబల్ మ్యూజియం ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా అరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ దోన్నుదొర మరియు పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీపూజ గార్లతో కలిసి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ...

ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకులో ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్రత పెరిగి,అనేక రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని అన్నారు.ప్రజలు ప్రతిరోజూ తడి చెత్త,పొడి చెత్తను వేరుచేసి,ప్లాస్టిక్ వ్యర్థాలను విడిగా స్వచ్ఛ రథం సిబ్బందికి అందజేయాలని సూచించారు.అలా అందజేస్తే ప్రతిగా నిత్యావసర సరుకులు పొందే అవకాశం ఉంటుందని అన్నారు.పర్యటక ప్రాంతమైన అరకులో పరిసరాల



పరిశుభ్రత కోసం స్వచ్ఛ రథం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పద్మపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి పెట్టెలి సుస్మిత అరకు మండలం సూపర్ ఎంపీపీ నరసింహమూర్తి ,వైసిపి నాయకులు పట్టాసి సంపత్ కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 28 నుండి మ్యూజియం ,గార్డెన్ కార్మికులు సమ్మె.





**అరకులోయ పెన్ పవర్ 24:** ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న గిరిజన మ్యూజియం పద్మపురం గార్డెన్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 28వ తేదీ నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు ఈనెల 8వ తేదీన స్థానిక అధికారులకు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది మరోసారి శనివారం కూడా సమ్మె నోటీసు స్థానిక అసిస్టెంట్ మేనేజర్ వారికి కార్మిక నాయకులు ఇవ్వడం జరిగింది గత కొంతకాలంగా వేతనాలు పెంచాలని కనీస వేతనం 26,000 చెల్లించాలని సీనియార్టీ ప్రకారం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, చట్ట ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం రిటైర్మెంట్ బెన్ఫిట్ స్కీం, మృతి చెందిన కార్మికులకు మట్టి ఖర్చులు 20000 ఇవ్వాలని ప్రధానమైన డిమాండ్లతో సమ్మెలోకి వెళుతున్నట్లు ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కార్యదర్శి దాడి రాజు గౌరవ అధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు శనివారం పత్రికలు తెలియజేశారు. గత కొంతకాలంగా డిమాండ్లు పరిష్కారం కై అధికారులకి విన్నవించిన పట్టించుకోలేదని అందుకే గత్యంత లేని పరిస్థితులు సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు ఎప్పటికైనా అధికారులు స్పందించి యూనియన్ నాయకులు బృందంతో చర్చించి డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వంతల రాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్ లో సీఐ గఫూర్ తనిఖీలు

**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 25) :**నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ లో శనివారం సాయంత్రం టౌన్ సిఐ షేక్ గఫూర్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను ఏ ఏ ప్రాంతాల నుంచి వచ్చారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని వివరాలు అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారు ఏ ప్రాంతానికి చెందినవారు, ఏ పనుల మీద వచ్చారన్న విషయాలను కూలంకషంగా తెలుసుకున్నారు. అదే విధంగా కాంప్లెక్స్ ఆవరణలో యువతులను ఎవరైనా ఏడిపిస్తున్నారా లేదా అనే అంశంపై ప్రత్యేక సిబ్బంది ని ఏర్పాటు చేసి ప్రతిరోజు గస్తీ నిర్వహిస్తున్నమన్నారు. ఇవిటీజింగ్ కు,



దొంగతనాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ రమేష్, ఎ ఎస్ ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుపై షార్ట్ ఫిలిం చిత్రీకరించిన ఉపాధ్యాయుడు

సామాజిక నైపుణ్యాలపై ఆధారంగా సాయిరాం దర్శకత్వంలో షార్ట్ ఫిల్మ్

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 24:** ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువును పక్కన పెడుతూ చెడు మార్గాల వైపు బాటపడుతున్న నేపథ్యంలో, వారికి విలువలున్న విద్య గురించి అవగాహన కల్పించేందుకు గూడెం కొత్తవీధి ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు సాయిరాం ముందుకు వచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచేందుకు ఆయన స్వంత పరిణితితో ఒక షార్ట్ ఫిల్మ్ రూపొందించారు."విలువలతో కూడిన విద్యను ఎలా పొందాలి?" అనే అంశాన్ని ఆధారంగా తీసుకొని, ప్రముఖ సినీ నటుడు సుమన్ మరియు జబర్దస్త్ కామెడీ యూనిట్ నటులతో ఈ షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. తల్లిదండ్రులు మెకానికల్ జీవితంలో బిజీగా ఉండి, తమ పిల్లలకు మంచి మార్గదర్శకత్వం ఇవ్వడానికి సమయం దొరకడం లేదని, అందుకే విద్యార్థులు తప్పు దారుల్లో పడిపోతున్నారని సాయిరాం చెప్పారు. ఈ సమస్యను ఎలా అదగమించాలి అనే బలమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని ఆయన వివరించారు.ఈ సందర్భంగా శనివారం మండల విద్యాశాఖాధికారి గోవింద్ పడాల్ ఆధ్వర్యంలో సీలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో షార్ట్ ఫిల్మ్ టీజర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయుడు సాయిరాం మాట్లాడుతూ, ఉన్నత విద్యాశాఖాధికారులకు ఈ షార్ట్ ఫిల్మ్‌ను చూపించి, ఆదేశాల మేరకు సోషియల్ మీడియాలో విడుదల చేయబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఏపీఆర్ ప్రిన్స్‌పాల్ బుచ్చిబాబు, దారకొండ ఆశ్రమ పాఠశాల ప్రథనోపాధ్యాయుడు హేమచంద్రతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్ పంపిణీ

ఉప సర్పంచ్ మడపల సోమేశ్ కుమార్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 24:**మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో రింతాడ పంచాయతీ నూతిబంధ గ్రామానికి చెందిన జాతీయ స్థాయిలో అండర్-14 వాలీబాల్ క్రీడాకారిణి శ్యామలదేవి మరియు గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మన్యపుత్ర యువజన సంఘ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ సోమేష్ కుమార్, పీసా కార్యదర్శి రాజేష్ కుమార్, టీడీపీ నేత పాండురాజు, సంఘ సభ్యులు చంద్రశేఖర్, శివాజీ, శ్రీను నేతృత్వంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సోమేష్ కుమార్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలు, చెడు మార్గాల వైపు కాకుండా సన్మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. యువత ఆటల్లో ప్రతిభ చూపించి రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం

- పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేసిన సింహాచలం దేవస్థానం ఉద్యోగులు



**సింహాచలం, పెన్ పవర్, జనవరి 24 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో మూడో శనివారం విస్తృత స్థాయిలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు పరిశుభ్రమైన, ఆధ్యాత్మిక శాంతితో కూడిన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి ఎన్. సుజాత ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ శుభ్రత కార్యక్రమం అత్యంత శ్రద్ధగా అమలు చేయబడింది. డిప్యూటీ ఈ.ఓ.సింగం రాధ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని ఏర్పరిచారు.

ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగ సిబ్బందితో పాటు ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొని, ఆలయ పరిసర ప్రాంతాలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచారు. ముఖ్యంగా రాజగోపురం ఎదుటి ప్రాంగణం, సింహగిరి పరిసర ప్రాంతాలు, భక్తులు అధికంగా సంచరించే మార్గాలు అన్నింటినీ శుభ్రపరిచి, చెత్తను తొలగించి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చారు.

శుభ్రత కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం, ఆలయ ప్రాంగణంలో పాల్గొన్న ఉద్యోగులందరితో "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" చేయించారు. ఈ సందర్భంగా వారు ప్రతిరోజూ పరిశుభ్రత కోసం సమయం కేటాయించడం, శ్రమదానం చేయడం, తడి చెత్తపొడి చెత్త వేరు చేయడంపై భక్తుల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో చురుకుగా పాల్గొనడం వంటి అంశాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ "స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధించడంలో సింహాచలం దేవస్థానం ముందుండి పనిచేస్తుంది. సింహాచలాన్ని 'స్వచ్ఛ సింహాచలం'గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం. భక్తులందరూ కూడా ఆలయ పరిశుభ్రతను కాపాడే బాధ్యతలో భాగస్వాములు కావాలి" అని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం ఏ.ఈ.ఓ. పంతం శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారులు బి. సత్య శ్రీనివాస్, త్రిమూర్తులు, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com